క్లుప్తంగా

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న సోలా మల్లికార్జున రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట గంగమ్మ గుడి వంశపారంపర్య ధర్మకర్త సోలా మల్లికార్జున రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ముందుగా గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అనుచరులు, అభిమానులు మధ్య కేకు కట్ చేసి, అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, వీఆర్ గౌతమ్, లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ



అభయక్షేత్రం నిర్వాహకులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందిస్తున్న దాతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని అభయ క్షేత్రంలో దివ్యాంగులకు ఉగాది సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన మాధురి గోల్డ్ షాప్ యజమాని సునీల్ కుమార్ పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది తొలి రోజున అభయ క్షేత్రంలోని దివ్యాంగులకు తన వంతు సహాయం చేయాలన్న ఉద్దేశంతో పండ్లు, బిస్కెట్లు వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో అభయ క్షేత్రం నిర్వాహకురాలు తస్లీమా పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య జయంతి



అన్నదానం చేస్తున్న శ్రీవేదనారాయణ ధర్మ రక్షణ సమితి సభ్యులు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేద నారాయణ స్వామి ఆలయంలో సోమవారం మత్స్యజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవేదనారాయణ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమానికి తమిళనాడుకు చెందిన శ్రీనివాస స్టీల్ ప్రొడక్ట్స్ సంస్థ యాజమాన్యం, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్యులు, బలరామ్, రిటైర్డు సీఐ జయచంద్ర రాజు పాల్గొన్నారు.

సంక్షేమానికి కూటమి గ్రహణం

సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకందించడమే కాకుండా ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయకు పురుడు పోసుకుంది. గ్రామస్థాయిలోనే రైతులకు ప్రభుత్వ సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆరోగ్య పరీక్షల కోసం మండల కేంద్రాలకు వెళ్లకుండా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పాడి రైతులకు గ్రామాల్లోనే పాలకేంద్రాలు నిర్మించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమానికి గ్రహణం పట్టింది. గత ప్రభుత్వంలో ప్రారంభమైన వాటి పట్ల ప్రభుత్వం మారగానే సంక్షేమం అమలు అటకెక్కడంతో పాటు ప్రజాధనం ప్రజాధనం వృథా అవుతోంది.



కారిపాకంలో నిర్మాణ దశలో ఆగిపోయిన గ్రామ సచివాలయ భవనం



కాంబాకంలో నిర్మాణ దశలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

- గత ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న సచివాలయ వ్యవస్థ
- పంచాయతీల్లో పూర్తిసేవలు అందిస్తున్న సచివాలయాలు
- ఎన్నికలు రావడంతో ఆగిన భవన నిర్మాణాలు
- చాలాచోట్ల 90 శాతం మేర పూర్తయినా అందుబాటులోకి తీసుకురాని కూటమి పాలకులు
- వృథాగా మారిన భవనాలు

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామీణ సంక్షేమం కుంటుపడింది. గత ప్రభుత్వం హయాంలో రైతులకు విస్తృత సేవలు అందించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు ఈ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి 13 గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వంలో ఈ వ్యవస్థకు కార్యరూపం దాల్చింది. అయితే ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ప్రజా సమస్యలకు సంబంధించి గ్రామ సచివాలయ భవనం, రైతుల అవసరాల కోసం రైతు భరోసా కేంద్రం, గ్రామస్థాయిలో పేదలకు వైద్యం అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పాడి రైతుల కోసం పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే కొన్నిచోట్ల పక్కా భవనాలు, నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. మరికొన్నిచోట్ల నిర్మాణ దశలో ఆగిపోయాయి. సార్వత్రిక ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో గత ప్రభుత్వంలో మంజూరైన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వరదయ్యపాళెం మండలంలో సైతం పలుచోట్ల సచివాయల, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి.

అర్ధాంతరంగా ఆగినవి ఇవే..

- మండలంలోని కారిపాకం గ్రామ సచివాలయ పరిధిలో సచివాలయ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు శ్లాబు దశ వరకు నిర్మాణం జరిగి ఆగిపోయాయి. రైతు భరోసా కేంద్రానికి సంబంధించి నిర్మాణ పనులే జరగలేదు. వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో సచివాలయం-2 భవనం గోడల దశలో ఆగిపోయింది. ఇక్కడ తాత్కాలిక భవనంలో సచివాలయ వ్యవస్థ కొనసాగుతోంది.
- కాంబాకంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు సంబంధించి 70శాతం పనులు పూర్తయి నిర్మాణ దశలో ఆగిపోయాయి. గ్రామ సచివాలయం పనులు పూర్తయినప్పటికీ ప్రారంభం కాలేదు.
- కడూరులో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు 90శాతం పనులు పూర్తయ్యాయి. 10శాతం పనుల కోసం తలుపులు వేసి ఉంచడం గమనార్హం. పెద్ద పాండూరులో విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రంలకు సంబంధించి పనులు ప్రారంభానికి నోచుకోలేదు.
- మరదవాడలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన పనులు ప్రారంభం కాలేదు.
- ఇందిరానగర్‌లో సచివాలయం, రైతు భరోసా పనులు పూర్తయినప్పటికీ చిన్నపాటి పనుల కోసం వాడుకలో లేకుండా మూతవేసి ఉండడం గమనార్హం.

ప్రజాధనం వృథా..



లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టారు. అర్ధాంతరంగా ఆగిన భవనాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసి వాడుకలోకి తేవాలి. నిర్మాణ దశలోనే వదిలి వేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతుంది. పాలకులు దీన్ని గుర్తించాలి.
–చిన్నిరాజ్, సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి

వాడుకలోకి తేవాలి



లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వినియోగించి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి. భవనాలను మూత వేసి ఉంచడం వల్ల ఉపయోగం లేదు. ప్రభుత్వాలు ఏవైనా కావచ్చు. ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనాలను పూర్తి చేయాలి. అభివృద్ధి పనుల్లో రాజకీయం చేయడం సరికాదు.
–దాసరి జనార్థన్, సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్






కాంబాకంలో అర్ధాంతరంగా ఆగిపోయిన రైతు భరోసా కేంద్రం వద్ద చెట్ల పొదలు, పులివల్లంలో అర్ధాంతరంగా ఆగిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్, కదూరులో చిన్నపాటి పనుల కోసం ఆగిపోయిన రైతు భరోసా, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలు, ఇందిరానగర్‌లో పనులు పూర్తయ్యి ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయం, రైతు భరోసా భవనాలు

పిచ్చమ్మకు నివాళులు



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నేత వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ ఇటీవల ఒంగోలులో మృతి చెందారు. సోమవారం ఆమె కర్మక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. పిచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పేదలపై ఆంక్షలు వద్దు



సీపీఎం నేతలకు సమస్యను విన్నవిస్తున్న వీకేఆర్‌పై కాలనీ గిరిజనులు

వరదయ్యపాళెం: మండలంలోని వీకేఆర్‌పై కాలనీలో స్థానికులు తమ అనుభవంలో ఉన్న భూముల్లో ఇళ్ల నిర్మాణం చేసుకుంటే స్థానిక రెవెన్యూ అధికారులు ఆంక్షలు విధిస్తూ నగదు డిమాండ్ చేస్తున్నారని స్థానిక బాధితులు వాపోయారు. ఆ మేరకు బాధిత కుటుంబాలు సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్థన్, ఆ పార్టీ నేతలు మెలుగు రమేష్‌కు విన్నవించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై వారు స్పందిస్తూ గూడు లేని నిరుపేద గిరిజనులు ఇళ్ల నిర్మాణం చేసుకుంటే ఆటంకం కల్పించడమేమిటని ప్రశ్నించారు. అంతేకాక గిరిజనుల వద్ద లంచాలను డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇలాంటి నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం పార్టీ ద్వారా జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కడూరు కూడలిలో గుంతలు



యానాదివెట్టు వద్ద బావులను తలపిస్తున్న గుంతలు



కంచరపాళెం వద్ద మట్టి రోడ్డును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు కూడలి-చిన్నపాండూరు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుమార్గంలో వాహనదారుల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. 10 కిలోమీటర్ల మేరకు అడుగుకు ఓ గుంత ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అటు వాటర్‌లైన్, ఇటు గ్యాస్ పైపులైన్ల కోసం రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు జరిపి వదిలేయడంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు రూపురేఖలే మారిపోయింది. అంతేకాక గతేడాది వర్షాలకు పలుచోట్ల రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తిగా ఆ మార్గం ధ్వంసమైంది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులను ఆపివేశాడు. కారణం కూటమి ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడమే. దీంతో అటు ఆగిపోయిన పనులు ఇటు మరమ్మతులకు గురికావడంతో 10 కి.మీ. దూరం వెళ్లాలంటే ఆ మార్గంలో అటు దుమ్ము, ఇటు గుంతలతో తీవ్రఇబ్బంది పడుతున్నారు. తక్షణమే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం



స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథంను సన్మానిస్తున్న నూకతోటి రాజేష్



సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- నూకతోటిరాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం సాధించేలా, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటిరాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ స్టేట్ కార్యదర్శిగా నియమితులైన ఉగ్గుమూడి గురునాథంకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు కొనతనేని మణినాయుడు అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కూటమిప్రభుత్వం అప్రతిష్ట మూటగట్టుకుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కేసులు పెట్టి వేధిస్తోందని ధ్వజమెత్తారు. సూపర్-6లో చెప్పిన పథకాలేమీ అమలు చేయకుండా రాష్ట్రంలోని విద్యార్థులు, మహిళలు, రైతులను నిలువునా చంద్రబాబు వంచిస్తున్నారని ఆరోపించారు. అనంతరం స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథంను శాలువ కప్పి, గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, సమన్వయకర్త రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్రవర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనరు వేలూరు రాకేష్, భాను ప్రకాష్‌రెడ్డి, సాయినాయుడు, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, దయాకర్‌రెడ్డి, తిలక్‌బాబు, దామోదర్‌రెడ్డి, చిన్నా, వినోద్, అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, కోటేశ్వరరావు, ప్రసాద్‌పాల్, గిరి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక రంజాన్



రేణిగుంట ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శ్రీకాళహస్తి: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్ జరుపుకున్న ముస్లింలు
- ప్రత్యేక ప్రార్థనలతో మసీదుల కిటకిట
- శ్రీకాళహస్తి, సత్యవేడులో రంజాన్ వేడుకలు



వరదయ్యపాళెం: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఐ

వరదయ్యపాళెం: శాంతియుతంగా జీవనం సాగించడంతో పేదలకు అండగా ఉంటూ ప్రతి వ్యక్తితో సోదరభావంతో మెలగాలని ఇస్లాం మత ఉద్దేశం అని ముస్లిం మత పెద్దలు బోధించారు. సోమవారం సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష బూనిన ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వరదయ్యపాళెంలోని ఈద్గా మైదానం వద్ద మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి అందరూ సుఖసంతోషాలతో ఆనందమయ జీవనం గడపాలని ఆశీర్వదించారు. గొసియా నగర్, ముస్లింపాళెం, సంతవేలూరు, గోవర్ధనపురం, పెద్ద పాండూరు, కడూరు గ్రామాలలో ముస్లింలు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జున భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని రాజీవ్‌గాంధీ నగర్ క్రీడా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మత పెద్దలుఇమామ్ ఖురాన్ సూక్తులను పఠించారు. సర్వ మానవాళి శాంతి సౌభ్రాతృత్వాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కాటూరు, గాజులపెళ్లూరు, గ్రామాల్లోని మసీదుల్లో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక హిందువులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సామూహిక రంజాన్ ప్రార్థనలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మండలకేంద్రం రేణిగుంటలో ముస్లింలు సోమవారం పవిత్ర రంజాన్ సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి మత గురువులతో కలిసి ప్రధాన వీధిలో ప్రదర్శనగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. మత గురువులు రంజాన్ ప్రత్యేకతను, ఖురాన్ ప్రబోధాలను తెలియజేశారు. రేణిగుంట పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్‌ఎం రఫీ ఉల్లా, సయ్యద్ అలీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. రేణిగుంటలోని శ్రీసిద్ధి వినాయక ట్యాక్సీ యూనియన్ అధ్యక్షుడు షంషేర్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఈద్గా, బస్టాండు వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు రంజాన్ ప్రత్యేకతను వివరించారు. పలుచోట్ల రంజాన్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.






వరదయ్యపాళెం: గోవర్ధనపురం ఈద్గా మైదానంలో, రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో, బుచ్చినాయుడుకండ్రిగ మసీదులో ప్రార్థనలు, ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీసిద్ధి వినాయక ట్యాక్సీ యూనియన్ సభ్యులు

మరుగుదొడ్లు ఇలా.. కాలకృత్యాలు ఎలా..?



రేణిగుంట పంచాయతీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గతంలో లక్షల రూపాయలు వెచ్చించి మరుగుదొడ్లను నిర్మించారు. ఇప్పుడు ఆ మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యాలయంతో పాటు రెండు సచివాలయాలు ఉన్నాయి. నిత్యం వివిధ పనుల కోసం పంచాయతీ కార్యాలయానికి వందల మంది స్థానికులు వస్తుంటారు. సుమారు వందమంది దాకా పారిశుద్ధ్య కార్మికులు పంచాయతీ కార్యాలయ ఆవరణలోనే సేదతీరుతూ ఉంటారు. పంచాయితీ అధికారులు మాత్రం కార్యాలయంలో బాత్రూం లు ఉండడంతో వారికి ఎటువంటి సమస్య లేదు. కాని పారిశుద్ధ్య కార్మికులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఆవరణలో నిరుపయోగంగా వదిలేసిన మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.